విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: పరీక్షా కేంద్రాల వద్ద నియమ నిబంధనలు పాటించాలని, ఎవరైనా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ మెంట్ చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి హెచ్చరించారు. సోమవారం నుండి పదవ తరగతి వ్రాత పరీక్షాలు నిర్వహి స్తున్న నేపథ్యంలో

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును జిల్లా ఎస్ పి పరిశీలించారు. ఏలూరు భాష్యం స్కూలును కె పీ డీపీ హై స్కూల్ ,అమలోద్భవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పి డి. మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి రోజు పదవ తరగతి పబ్లిక్ వ్రాత పరీక్ష నిర్వహిస్తున్న సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్రాత పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లను జిల్లా పోలీసు యంత్రాంగం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బంది, అభ్యర్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు.పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు మూసి వేయించామన్నారు. పరీక్ష పూర్తయ్యేవరకు అధికారులు, సిబ్బంది అందరు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

తల్లిదండ్రులను నిరాదరణకు గురి చేసే పిల్లలపై క్రిమినల్ కేసులు : కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు : తల్లితండ్రులను నిరాదరణకు గురిచేసే పిల్లలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ద్వారకా తిరుమల తహసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమ వారం విధులు అనంతరం క్యాంపు కార్యాలయం నకు బయలుదేరిన జిల్లా కలెక్టర్ ను ద్వారకా తిరుమల మండలం పి .కన్నాపురం

గ్రామానికి చెందిన బొప్పన చిట్టెమ్మ కలిసి తన బాధను తెలిపి తనకు న్యాయం చేయాలని కోరింది. తనకు ముగ్గురు కుమారులని, తన పెద్ద కుమారుడు, మూడో కుమారుడు మరణించారని, తన రెండవ కుమారుడు తనను పట్టించు కోవడంలేదని, నిరాదరణకు గురిచేస్తున్నాడని, తనకు ఎటువంటి ఆధారం లేదని తనకు న్యాయం చేయాలని కలెక్టర్ వద్ద తన బాధను తెలిపి, విలపించింది. చిట్టెమ్మ బాధను అర్థం చేసుకున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వెంటనే స్పందించి ద్వారకా తిరుమల తహసీల్దార్ కు ఫోన్ చేసి, వివరాలు తెలియజేసి, వెంటనే విచారణ చేయాలన్నారు. వయోవృద్ధులు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చారని, తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేసే వారిని ఎట్టి పరిస్థితు లలోనూ ఉపేక్షించవద్దని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. తన సమస్యపై వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కు చిట్టెమ్మ కృతజ్ఞతలు తెలియజేసింది.

ఎన్నికల నియమావళి అమలుకు కంట్రోల్ రూమ్

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డిఓ, రిటర్నింగ్ ఆఫీసర్ కె.చెన్నయ్య తెలిపారు. సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల

కమిషన్ ఆదేశాలను అమలు చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సమస్యలను తెలియజేసేందుకు తాడేపల్లిగూడెం కంట్రోల్ రూమ్ నెంబర్ 08818 229699 కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. పట్టణంలో నియోజకవర్గంలో ఇప్పటికే రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు బ్యానర్లు తొలగించామన్నారు. విగ్రహాలకు ముసుగులు కప్పేమన్నారు. రాజకీయ పార్టీ నాయకుల పేర్లు ఉన్న శిలాఫలకాలను పేపర్‌తో మూసివేసా మన్నారు. నిష్పక్షపాతంగా వివక్ష లేకుండా ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేశా మన్నారు. నియోజవర్గ పరిధిలో 63 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించా మన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బి.మురళీకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షకు 93.22 శాతం మంది హాజరు

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు 93.22 శాతం మంది విద్యార్థులు హాజం య్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. అబ్రహం తెలిపారు. సోమవారం జరిగిన తెలుగు పరీక్ష పేపర్-1కు 25 , 939 మంది కి 24,181మంది హాజరు కాగా 1758 మంది హాజరు కాలేదని డీఈవో తెలిపారు. అధికారులు జిల్లా వ్యాప్తంగా మొత్తం 29 పరీక్ష కేంద్రాలను

తనిఖీ చేశారని ఆయన తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : డీఎస్పీ

విశాలాంధ్ర-నరసాపురం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని నరసాపురం డిఎస్పి జి.శ్రీనివాసరావు అన్నారు. సోమ వారం పట్టణంలోని పీచుపాలెం నుండి పట్టణ పోలీసులు, సిఐ ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో కవాతు నిర్వహించారు. పీచుపాలెం సెంటర్ నుంచి లూథరన్ చర్చి వరకూ వీధుల గుండా కవాతు

నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం డీఎస్పి జి.శ్రీనివాసరావు,సీఐ కె.ఎ. స్వామి మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో అల్లర్లు, కవ్వింపు చర్యలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రశాంత వాతావరణం కలిగిస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది టి. పాపారావు, ఎస్.చక్రధర్, ఇ. అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వల

- ఊరూవాడా హోర్డింగ్‌ల హంగామా
- కోడ్ రాకతో తొలగింపు తథ్యం

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు: సార్వత్రిక ఎన్నికల సమరం సమీపిస్తుండడంతో కలలు పేరిట ఓటర్ల పై ఎన్నికల వలలు విసురుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఎక్కడ చూసినా సిద్ధం పోస్టర్లు కనిపించేవి. ఇప్పుడు వాటి స్థానంలో జగన్ మానస పుత్రిక వ్యవస్థ వాలంటీర్లను ఉపయోగించుకోవడంలో తల మునకలై ఉన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలకు పీడ కలను చూపించిన జగన్ వచ్చే ఐదేళ్లలో మరింత పైస్థాయికి తీసుకుని వెళతానని చెబుతుండడం గమనార్హం.

జాబ్ క్యాలెండర్ ఊసే లేకుండా...

యువత నా కల అని జగనన్న మరోసారి మభ్యపెట్టడానికి సిద్ధమవుతున్నారు. పాదయాత్రలో ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్నారు. మెగా డి.ఎస్.సి తీస్తామన్నారు. నిజమేనని నమ్మిన యువతను అధికారంలోకి వచ్చాక నట్టేట ముంచారు. ఐటీ రంగాన్ని నిర్వీర్యం చేశారు. అనేక పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయి. కొత్త కంపెనీలు, పరిశ్రమలు రాలేదు. యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోవాల్సి వచ్చింది. నాలుగున్నర ఏళ్ళ వరకు యువతను పట్టించుకోని జగన్ ఎన్నికలవేళ డి.ఎస్.సి అంటూ దగా డి.ఎస్.సిని ప్రకటించారు. డి ఎస్ సి పరీక్షల నిర్వహణ షెడ్యూల్ రెండుసార్లు మార్చి అయోమయానికి గురి చేశారు. షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక డి.ఎస్.సి ప్రకటిస్తామని గిరిజన యువతను నమ్మించి మోసగించి వారి కలల రెక్కలను విరిచేశారు.

సర్కారీ బడులు వెలవెల

పిల్లలకల నా కల అంటూ మేనమామగా చెప్పుకుంటున్న జగన్ ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను కిలోమీటర్ దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. అప్పటివరకు కళకళలాడిన పాఠశాలలు విలీనం తర్వాత వెలవెలబోయాయి. చిన్నపిల్లలను దూరాన ఉన్న బడికి పంపించడానికి భయపడి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేశారు. విద్యారంగంలో వందలకోట్ల రూపాయలు ఖర్చు చేశామని ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పుకుంటున్నారు. మరి సర్కారు బడిని పిల్లలు ఎందుకు వీడుతున్నారంటే మాత్రం చెప్పలేకపోతున్నారు. మళ్లీ మేనమామ వస్తే మూడు కిలోమీటర్ల దూరంలో ప్రాథమికబడి ఉండదని ఉపాధ్యాయులే చెబుతున్నారు.

అవ్వ తాతల కళ్ళకు గంతలు

అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వాతాతలకు రూ.3 వేలు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. నిజమేననుకుని పించను లబ్ధిదారులంతా నమ్మేశారు. ఓట్లు వేసి అందలం ఎక్కించారు. ప్రభుత్వం కొలువు తీరాక అబ్బే నేనేమీ ఒక్కసారి వేయి పెంచుతానని అనలేదు పెంచుకుంటూ పోతామనే అన్నాను అంటూ మడమ తిప్పారు. వీరే కాదు కార్మికులు, అంగన్వాడీలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం రోడ్డెక్కితే వారికి మేలు కంటే చేసిన వడ్డింపులే ఎక్కువగా ఉన్నాయి. జగన్ ఏయే వర్గాన్ని ఎంత మోసం చేశారో తెలుసుకోవాలని విపక్షాలు సూచిస్తున్నాయి.

ఆటకెక్కిన సాగునీటి ప్రాజెక్టులు

చింతలపూడి ఎత్తిపోతల పథకం మెట్ట ప్రాంత వాసులకు చింతగానే మిగిలిపోయింది. నాటి ఎన్నికల సందర్భంగా చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తానని వాగ్దానం చేసి నిర్మాణాన్ని గాలికి వదిలేసారు. తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు అటకెక్కించారు. నిర్వాసితుల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. తనకి 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పి తెలుగు ప్రజల కలగానే మిగిల్చారు. మళ్లీ ఎన్నికల సందర్భంగా నూజివీడులో జరిగిన సభలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తానంటూ కల్లబొల్లి ఉపన్యాసాలు ఇచ్చారు. అయితే రాబోయే ఎన్నికల సందర్భంగా జగన్ అన్ని వర్గాల ప్రజలను ఏ విధంగా మోసం చేసింది ప్రజలకు తెలియజేసి, విస్తృతంగా ప్రచారం చేసి వైసిపి పాలనకు తగిన గుణపాఠం చెప్పటానికి విపక్షాలు ఇప్పటికే తగిన ప్రణాళికలు రూపొందించారు.

ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగింపు

విశాలాంధ్ర - కలిదిండి: రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలంలో వివిధ రాజకీయ పార్టీలకు

సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియ అధికారులు ప్రారంభిం చారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్‌స్క్వాడ్ టీం అధికారి విశ్వ కుమార్, ఎమ్మార్వో దశక వంశీ, ఎంపీడీవో దినతేజ్, ఆర్ఓ కే. భాస్కరరావు, ఈఓపిఆర్‌డి వై. రాజారావు, ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వో శ్రీనివాసరావు, పంచా యతీ, సచివాలయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, ఆడపడుచుపై కేసు నమోదు

విశాలాంధ్ర-టీ నరసాపురం: బండివారిగూడెం పంచాయతీలోని గంగినీడుపాలెం గ్రామానికి చెందిన కురేటి ధనలక్ష్మిని భర్త సుబ్రహ్మణ్యం,అత్త,ఆడపడుచులు తక్కువ కట్నం తెచ్చావని మానసికంగా శారీరకంగా వేధిస్తున్నారని ధనలక్ష్మీ ఫిర్యాదుతో టి నరసాపురం ఎస్ఐ డి. దుర్గా మహేశ్వర రావు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అధికారం కోసమే బండారు తాపత్రయం

విశాలాంధ్ర-నరసాపురం: అధికారం కోసమే మాజీ ఎమ్మెల్యే బండారు తాపత్రయం అని తెదేపా సీనియర్ నాయకులు భూపతి నరేష్, గుబ్బల నాగరాజు, సంధి నర్సింహరావు, సంకరపు వెంకటేశ్వరరావు ,జోగి పండు,గుత్తుల రాధ కృష్ణ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెదేపా నరసాపురం ఇన్‌చార్జిగా పొత్తూరి రామరాజు క్రమశిక్షణగా వ్యవహరిస్తూ అందరిని

సమన్వయం చేసుకుంటున్నారన్నారు. అటువంటి మంచి వ్యక్తిని తెదేపా నాయకులు అని చెప్పుకునే కొంతమంది వ్యక్తులు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఎంపి అభ్యర్థి గోకరాజు గంగరాజు డబ్బులతోనే ఎమ్మెల్యేగా మాధవనవాయుడు అయ్యారన్నారు. ఇప్పుడు నీతులు చెప్పే వారు రజకుల లోనులో చేతివాటం చూపించడం నిజం కాదా అని ప్రశ్నించారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతర్

విశాలాంధ్ర - పెనుమంత్ర: ఎన్నికల కమిషన్ ఆదేశాలను పెనుమంత్ర మండలంలో అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. కోడ్ అమలు ప్రశ్నార్థకంగా మారింది. కేవలం ప్రధాన రహదారులు సెంటర్ల పై దృష్టి పెట్టి ఇతర ప్రాంతాలపై గాలికి వదిలేయడంతో ఎక్కడికక్కడే నాయకుల చిత్రపటాలు దర్శనమిస్తూనే ఉన్నాయి... నత్తా రామేశ్వరం లో గోస్తాని గట్టుకు చేర్చి నిర్మిస్తున్న హెల్త్ క్లినిక్ వద్ద బోర్డుకు

సీఎం చిత్రపటం దర్శనమిస్తుంది. ఆలమూరు హెల్త్ క్లినిక్ కి వెళ్లే మార్గంలో నాయకుల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలు భారీ సంఖ్యలో ఉన్నాయి. నెగ్గిపూడి ప్రైవేటు కళాశాల వద్ద శిక్షణ కేంద్రానికి సంబంధించిన ఫ్లెక్సీలో సీఎం చిత్రం ఉన్న వాటిని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

విశాలాంధ్ర - కలిదిండి: ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే డిఎన్ఆర్ కోడలు శ్రీఅనుపమ ఓటర్లను కోరారు. సోమవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయకులతో కలిసి ఇంటింట ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా, నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో నిధులు జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్

జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జడ్పీటీసీ బొర్రా. సత్యవతి, ఏఎంసి చైర్మన్ కొల్లాటి. సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని. రమేష్, పిఎసిఎస్ అధ్యక్షులు వద్లాని. పార్థసారథి, రేవు. నరసింహారావు, జి.వెంకటేశ్వర రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి

విశాలాంధ్ర-టీ నరసాపురం: రాబోయే పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా అభ్యర్థులను గెలిపించాలని ఏఐటీయుసి చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షులు టివిఎస్ రాజు కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. మక్కినవారి గూడెం ఏఐటియుసి కార్యాలయంలో ముఠా వర్కర్స్ యూనియన్ సమావేశం అధ్యక్షులు మల్లెల సత్యనారా యణ అధ్యక్షతన సోమవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి

ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజు మాట్లాడుతూ మతోన్మాద బిజెపిని అవకాశవాదులైన టిడిపి జనసేన, ఆర్థిక నేరస్థుడు జగన్మోహన్ రెడ్డిని చిత్తుగా ఓడించి సిపిఐ సిపిఎం భాగస్వాములుగా ఉన్న ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని అన్నారు.నరేంద్ర మోడీ విశాఖ ఉక్కు లాంటి పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి దేశంలో నిరు ద్యోగం పెంచాడని విమర్శించారు. విభజన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫల మయ్యాడని ఆయన తెలిపారు. గత ఎన్నికల్లో నరేంద్ర మోడీని దారుణంగా దూషించిన చంద్రబాబు కాషాయ కూటమిలో చేరడం ఆయన అవకాశ వాదానికి నిదర్శనం అన్నారు. రానున్న పార్లమెంటుకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి మతోన్మాద బీజేపీ, అవకాశవాద టిడిపి జనసేన,ఆర్థిక నేరస్తుడు జగన్మోహన్ రెడ్డిలను చిత్తుగా ఓడించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ చింతల పూడి ఏరియా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాసరావు, ముఠావర్కర్స్ యూనియన్ కార్యదర్శి సతీష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 23,171 పోస్టర్లు, బ్యానర్లు తొలగింపు

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చిన సందర్భంగా రాజకీయ ప్రకటనలకు సంబంధించి 23 వేల 171 పోస్టర్లు, బ్యానెర్లు, ఫోటోలు, తదితరాలు తొలగించినట్టు జిల్లా పరిషత్ సి ఈ ఓ, జిల్లా ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు నోడల్ అధికారి కె. ఎస్. ఎస్. సుబ్బారావు తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ పథకాలకు సంబంధించి పబ్లిక్ ఆస్తుల వద్ద ఉన్న సంబందించిన ఫోటోలతో కూడిన 883 వాల్ రైటింగ్స్,5717 పోస్టర్లు, 5634 బ్యానెర్లు, 2140 హోర్డింగ్లు, జెండాలు వంటివి మొత్తం 14 వేల 374 తొలగించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధన ప్రకారం దేశ, రాష్ట్ర నాయకులకు చెందిన 2697 విగ్రహాలకు ముసుగులు వేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రైవేట్ ప్రదేశాలలో ఉన్న 558 వాల్ రైటింగ్లు, 3778 పోస్టర్లు, 2981 బ్యానెర్లు, 1480 హోర్డింగ్లు, జెండాలు వంటివి మొత్తం 8,797 తొలగించామని, దేశ, రాష్ట్ర నాయకులకు చెందిన 4052 విగ్రహాలకు ముసుగులు వేశామని తెలిపారు.

దోమలను నివారించి వ్యాధులను అరికట్టాలి

విశాలాంధ్ర-లింగపాలెం : మలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని చింతలపూడి సబ్ యూనిట్ అధికారి ఎన్.ఏ.ప్రసాద్ పంచాయతీ కార్యదర్శు లను ఆదేశించారు. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలుతున్నాయని, వీటిని నిర్మూలించాలని ఈయన కోరారు. మలేరియా నిర్మూలనపై లింగపాలెం మండల పరిషత్ పరిపాలన అధికారి

మణికుమారితో సమీక్ష నిర్వహించారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ప్రతి గ్రామంలో వారానికి రెండుసార్లు మలాథిన్ లో డీజిల్ కలిపి ఫాగింగ్ చేయాలని సూచించారు. దోమలను నిర్మూలించేం దుకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కోరారు. నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోకపోతే వారిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

భవిత కేంద్ర దివ్యాంగ విద్యార్థులు పరీక్షలకు హాజరు

విశాలాంధ్ర-ముదినేపల్లి : మానసిక దివ్యాంగ విద్యార్థులు ఇద్దరు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. ముదినేపల్లిలో ప్రత్యేక అవసరాలుగల భవిత కేంద్రంలో చదివిన స్థంభం చెరువుకు చెందిన రెడ్డి నవదీప్, వడాలి గ్రామానికి చెందిన

పెందుర్తి సునీత ఎవరి సహకారం లేకుండానే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్షలకు అనుమతించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - భీమవరం : ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేదీ నమోదు చేయడంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్క రించాలని జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు జిల్లా ఖజానా గణాంక అధికారి ఏ.గణేష్ కు వినతి పత్రం అందజేశారు. తనిఖీల్లో భాగంగా సోమవారం భీమవరం సబ్ ట్రెజరీ విచ్చేసిన

ఆయనను సంఘం సభ్యులు కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా మంజూరైన పిపిఓలో పాత జిల్లా కేంద్రమైన ఏలూరు డిటివో కార్యాలయం నుంచి భీమవరం ట్రెజరీకు రావాల్సి ఉందని, ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ వచ్చే వరకు ఇదే విధంగా జరుగుతుందని త్వరలో మార్పు చేస్తామన్నారు. తొలుత జిల్లా ఖజానా అధికారిని సంఘం తరపున సత్కరించారు. కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి అల్లూరి రవివర్మ, భీమవరం యూనిట్ కార్యదర్శి పి.సీతారామరాజు, జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గాతల జేమ్స్, కార్యదర్శి సాగిరాజు సత్యనారయణ రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.వి.భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు ఎస్ కే చాన్ భాషా, సీనియర్ పెన్షనర్స్ బి.సత్యనారాయణ రాజు, చెరుకువాడ రంగసాయి, జీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎస్ఎస్‌సి పరీక్షలు

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఎస్.ఎస్.సి., పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తు న్నామని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఏలూరు జిల్లాలో సోమవారం ప్రారంభమైన ఎస్.సి.సి., పరీక్షల

నిర్వహణను ఏలూరు నగరంలోని సెయింట్ థెరెసా హైస్కూల్ లో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. పరీక్షా హాలులో తాగునీరు, ఫ్యాన్లు, బల్లలు వంటివి విద్యార్థులకు ఏర్పాటుచేసిన సౌకర్యాలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా పరీక్ష హాలులో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల వెంట సెల్‌ఫోన్, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించ వద్దని, వాటిని భద్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు పట్టీ ప్రకారం విద్యార్థులు ఉన్నారో, లేదో అన్న విషయాన్ని కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు తగినన్ని సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట డీఈఓ ఎస్. అబ్రహం, ప్రభృతులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగస్తుల గ్రీవెన్స్ డే

విశాలాంధ్ర -భీమవరం టౌన్: మెడికల్ డిపార్ట్మెంట్‌కు సంబంధించి గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆరోగ్యశాఖ అధికారి(డి ఎం ఎస్ హెచ్ ఓ) డాక్టర్ మహేశ్వర రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్. డాక్టర్ పద్మావతి సూచనల మేరకు మంగళవారం ఉదయం గం.10నుండి 2 గంటల వరకు తమ కార్యాలయంలో నిర్వహిస్తున్నామన్నారు.పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎవరైనా జీతాలకు సంబంధించిన సమస్యలుంటే ఆరోజు జరిగే గ్రీవెన్స్ కి స్వయంగా వెళ్లి తమ సమస్యలను డి ఎం హెచ్ వో కి తెలియపరచాలన్నారు. అనంతరం ఈ సమస్యల పైన వచ్చిన వినతులను విజయవాడ గొల్లపూడి లోని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపనున్నట్లు డిఎంహెచ్వో తెలిపారు.

కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించండి

విశాలాంధ్ర -లింగపాలెం : కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని కె.గోకవరంలో నివాసం ఉంటున్న ముదిలాయర్లు కులస్తులు తహసీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్‌ను కోరారు. వందేళ్ల నుంచి కుల ధ్రువీకరణ కోసం ఎదురుచూస్తున్నా తమ ఆశ నెరవేరటం లేదని ఆవేదన చెందారు. వలసదారులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని 2023లో ప్రభుత్వం జి.ఓ 25

జారీ చేసినప్పటికీ తమకు ధ్రువీకరణ పత్రాలు అందటం లేదన్నారు. కె.గోకవరంలో 400 మంది జీవనం సాగిస్తున్నామని కుల ధ్రువీకరణ లేకపోవడం వలన ప్రభుత్వం సదుపాయాలు అందటం లేదని, విద్య, ఉద్యోగ పరంగా ఇబ్బందులు పడుతున్నా మని తహసిల్దార్‌కు వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన జి.ఓ ప్రకారం తామంతా బి.సి.డి కులంగా అర్హులమని వీటిని అందించాలని కోరారు. దీనిపై తహసిల్దార్ మాట్లాడుతూ ఈ సమస్యపై విచారణ చేసి నివేదికను కలెక్టరు కు అందిస్తామని అన్నారు. తాను కలెక్టరు కు ఇచ్చే నివేదికలో పూర్తి వివరాలు అందిస్తానని తెలిపారు. వలసదారులకు కుల ధ్రువీకరణ ఇచ్చే అధికారం కలెక్టర కే ఉందని వివరించారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఐటీడీఏ పీవో

విశాలాంధ్ర-బుట్టాయిగూడెం: ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఐటిడిఏ పిఓ. ఎం .సూర్య తేజ, కెఆర్ పురం లోని ఏపీ టి .డబ్ల్యూ. ఆర్ .(బాలుర) స్కూల్లో నిర్వ హిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శిం చారు. ఈ

సందర్భనలో భాగంగా పదో తరగతి పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. త్రాగునీటి వసతి అందుబాటులో ఉందా లేదా అని గమనించారు. ఎగ్జామ్స్ హాల్‌లో సెల్ ఫోన్లు స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అనుమతి లేనందున చాలా నిశితంగా పరిశీలించా లని పరీక్ష నిర్వహణ పర్యవేక్షకులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు అందు బాటులో ఉన్న సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు.

నేటి నుండి దండు మారెమ్మ అమ్మవారి ఉత్సవాలు

విశాలాంధ్ర - గణపవరం: కొల్లేటి గ్రామాలకు ముఖ ద్వారంగా ఉన్న గణపవరం గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత దండు మారెమ్మ అమ్మవారి 325వ వార్షిక తీర్థ మహో త్సవాలు ఈనెల 19వ తేదీ నుండి 27వ తేదీ వరకు వారం రోజులు పాటు జాతర తిరణాలు జరుగుతాయని ఆలయ ఉత్సవ కమిటీ సోమవారం తెలిపింది. భీమవరం మావుళ్ళమ్మ తర్వాత అంతటి సత్యవంతమైన దేవతగా పేరుపొంది 60 గ్రామాల నుండి భక్తులు ఈ తిరణాలలో పాల్గొంటారని తెలిపారు. మంగళవారం సాయంత్రం

గవళ్ళ గుడుపు సేవతో జరుగుతుందని ఈ సేవలో రాజేశ్వరి కాళజక నృత్య ప్రదర్శన, లక్ష్మీ దుర్గ డీకే తీన్మార్, సాయిబాబా మ్యూజికల్ ఫుల్ బ్యాండ్ పార్టీ, కనకమహాలక్ష్మి ఈవెంట్స్ జై భజరంగ్ డీజే మిక్సింగ్, ధానేశ్వరి చందా మేళం, కేరళ డ్రమ్స్, డి ఎం ఎస్ నాసిక్ డోలు వంటి కార్యక్రమాలతో జరుగుతాయని 20 తేదీన రాత్రి 8 గంటలకు కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన, 21న నాని ఆర్కెస్ట్రా ఈవెంట్స్, 22న బాలనాగమ్మ వెరైటీ బుర్రకథ, 23న సత్య హరిచంద్ర నాటకం, 24న స్వాతి ఆర్కెస్ట్రా మ్యూజికల్ నైట్, 25న సినీ మ్యూజికల్ నైట్, 27న అఖండ అన్న సమారాధన జరుగుతుందని ఉత్సవ కమిటీ తెలియజేసింది.

ఆరోగ్య శిబిరాల్లో ఎన్నికల నియమాలు పాటించాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం పిప్పర పి.హెచ్. సి పరిధిలోని సి. హెచ్. అగ్రహారం గ్రామంలో సోమవారం జరుగుతున్న డాక్టర్ ఫ్యామిలీ కార్యక్రమంను పశ్చిమగోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వర రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలక్షన్ కమిషన్ కోడ్ నియమ నిబంధనలు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలు అమలు సిబ్బంది పాటించారా

లేదా అని పరిశీలించారు.ఎన్నికలు పూర్తయ్యేంత వరకు అధికారుల ఆదేశాలు పాటించాలని తెలియ జేశారు.ఆరోగ్య శిబిరంలో కూడా ఎన్నికల నియమాలు పాటించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ యస్ సంతోష కుమార్ రెడ్డి, సిసి మహీధర్, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, ఎం ఎల్ హెచ్ పి మాధురి, ఏ ఎన్ ఎం ఎసమ్మ, డి ఈ ఓ వసంత, ఆశ కార్యకర్తలు భవాని, దుర్గ ,తదితరులు పాల్గొన్నారు.

బిషప్ జయరావ్ పొలిమేర ఆశీస్సులు అందుకున్న చింతమనేని ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: దెందులూరు నియోజకవర్గ టిడిపి జనసేన బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ సోమవారం ఉదయం రోమన్ కథోలిక పీఠం ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ అగ్ర పీఠాధిపతిగా కూడా ఇటీవల బిషప్ జయరావ్ అదనపు బాధ్యతలు అందుకున్న

సందర్భంగా వారికి చింతమనేని ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిషప్ జయరావ్ ప్రత్యేక ప్రార్ధన నిర్వహించి చింతమనేని ప్రభాకర్‌కు ఆశీస్సులు అందచేశారు. అనంతరం అమలోధ్భవి కథిడ్రల్ చర్చిలో ఆలయ గురువు ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చింతమనేని ప్రభాకర్ ను ఆశీర్వదిస్తూ పరిశుద్ధ జలంతో దీవించారు.ఈ కార్యక్రమంలో సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియెల్, ఫాదర్ రాజు, ఫాదర్ స్టీవెన్ థామస్ సహా పలువురు గురువులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న "మనకోసం మనం" సేవా సంస్థ

విశాలాంధ్ర - పాలకొల్లు : పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో మజ్జి బంగారు నాయుడు కుమారుడు, శివప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై, కాలు విరగడంతో రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అయినప్పటికీ ఆరోగ్యం కుదురుపడక మంచాన పడి, తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. కుటుంబ పోషణ కష్టంగా మారింది అనే విషయం

తెలుసుకున్న "మన కోసం మనం" స్వచ్ఛంద సేవా సంస్థ, అధ్యక్షులు పడాల పెద్దిరాజు, సభ్యులతో కలిసి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సహాయంగా వైద్య ఖర్చులు నిమిత్తం రూ.3వేల రూపాయలు నగదు, బియ్యం బస్తా, నిత్యవసరకులు, అందించారు. సంస్థ అధ్యక్షుడు పడాల పెద్దిరాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వం అనిపించుకుంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో కలిశెట్టి కనకారావు, పడాల కృష్ణవేణి, దాసరి సత్యనారాయణ, ఉదయ్, కలిశెట్టి లక్ష్మీ, సిద్ధార్థ, కేతలి నాగేశ్వరరావు, యలకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలంలో సోమవారం జరిగిన 10వ తరగతి తెలుగు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు గణపవరం మండల విద్యాశాఖ అధికారి పుచ్చల శేషు అన్నారు. సోమవారం పరీక్ష వ్రాసిన విద్యార్థుల వివరాలను వెల్లడించారు. గణపవరం మండలంలో మొత్తం 852 మంది విద్యార్థిని విద్యార్థులు ఉండగా ఈరోజు 785 మంది పరీక్షలు వ్రాశారని 67 మంది గైరాజనం అవ్వడం జరిగిందన్నారు. గణపవరం బాయ్స్ హై స్కూల్లో 188 మంది కి 183 మంది

పరీక్షలు వ్రాశారని ముగ్గురు గైర్హాజరు, గణపవరం బాలికల హైస్కూల్లో 205 మంది విద్యార్థులు గాను 170 మంది పరీక్ష వ్రాశారని 35 మంది గైరాజాలైనట్లు తెలిపారు. పిప్పర జడ్పీ హైస్కూల్లో 179 మందికి 170 మంది పరీక్షలు వ్రాశారని 9 మంది గైర్హాజరు. అర్ధవరం హై స్కూల్లో 114 మంది కి 110 మంది వ్రాశారని నలుగురు గైర్హాజర్, కాశిపాడు హైస్కూల్లో 24 మందికి 19 మంది వ్రాయిగా ఐదుగురు గైర్హాజరు, పిప్పర ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 142 మందికి 133 మంది పరీక్షలు వ్రాయిగా తొమ్మిది మంది తెలిపారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: సోమవారం ఉదయం ప్రారంభమైన పదోవతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తాడేపల్లిగూడెం మండల విద్యాశాఖాధికారి పి.ఎమ్.కె.జ్యోతి తెలిపారు.తాడేపల్లిగూడెం పట్టణం, మండలం కలిపి13 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ పరీక్షలకు మొత్తం 2656 మందికి 2467 మంది హాజరయ్యారని,187 మంది ఆబ్సెంట్ అయ్యారన్నారని ఎం ఇ ఓ జ్యోతి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ కార్పొరేటర్ బౌరోతు బాలాజీకి మాతృవియోగం

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు స్థానిక 40 వ డివిజన్ గాంధీ నగర్ లో తెదేపా మాజీ కార్పొరేటర్ బౌరోతు బాలాజీ తల్లి బౌరోతు సీతా లక్ష్మి ఆదివారం ఉదయం కన్నుమూశారు. సీత లక్ష్మి పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలో 1935లో ఏప్రిల్ 4వ తేదీన జన్మించారు. వీరికి నలుగురు కుమారులు, ఇరువురు సంతానం. సీతాలక్ష్మి నిరుపేదలకు,వృద్ధులకు, వికలాంగులకు చేసిన సేవ లను పలువురు కొనియాడారు. శోకసముద్రంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను అల్లూరి సీతారామరాజు స్టేడియం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్

సభ్యులు, వివిధ పార్టీ నాయకులు,కార్యకర్తలు, ఫ్లాష్ సభ్యులు,బంధువులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విభజన హామీలు, ప్రత్యేక హోదా సాధిస్తాం

విశాలాంధ్ర-కాళ్ల: ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు విభజన హామీలు నెరవేరుస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య అన్నారు. కాళ్లకూరు గ్రామంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య స్వగృహం వద్ద సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశంలో సోడదాసి గంగయ్య మాట్లాడుతూ బలహీన వర్గాల నుండి నన్ను రాష్ట్ర

కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా ఎన్నుకున్నందుకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తనపై పెట్టిన గురుతర బాధ్యతను వమ్ము చేయకుండా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పార్టీని బలోపేతం చేయడానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలియజేశారు. పోలవరం నిర్మాణం, రాష్ట్ర రాజధాని, విభజన హామీలు అమలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 7 గ్యారంటీహామీలనుప్రజల్లోకి తీసుకెళతా మన్నారు. ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని మార్చే సమయం ప్రజలకు వచ్చింది ఈసారి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో పిసిసి సభ్యులు అంకెం సీతారాం, జిల్లా యూత్ అధ్యక్షులు సోము నాగ కేశవ బాబు, జిల్లా కార్యదర్శి కొండా రాజేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతా ఆదిశేషు, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సోము అప్పలరాజు, ఉండి నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు బోరాడ గౌరీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర-టి నరసాపురం: పదవ తరగతి తెలుగు పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారులు టి. రామ్మూర్తి, ఎస్. కళ్యాణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 581మంది విద్యార్థులకు 534 మంది విద్యార్థులు హాజరు కాగా 47 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. టి నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 216 మందికి 187

మంది, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-ఎ కేంద్రంలో 258 మందికి 248 మంది, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-బి కేంద్రంలో 33 మందికి 24 మంది విద్యార్థులు, అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 74 మంది విద్యార్థులకు 73 మంది పరీక్షకు హాజరైనట్లు వారు తెలిపారు.

పత్తేపురంలో జనంలోకి ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: ఉంగుటూరు నియోజకవర్గం జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం వచ్చింది నన్ను ఆశీర్వదించండి అని జనసేన పార్టీ పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. సోమవారం నిడమర్రు మండలం చిన నింద్రకొలను గ్రామంలో జనంలోకి ధర్మరాజు అనే

కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులతో పత్సమట్ల ధర్మరాజు ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ చిన నింద్రకోలను గ్రామస్తుడిగా ఎమ్మెల్యే అభ్యర్థి గా పోటీ చేసే అవకాశం మూర్తి రాజు గారి తరువాత తనకు వచ్చిందని కూటమి అభ్యర్థిగా నన్ను గెలిపించి సొంత గ్రామ ప్రజల రుణం తీర్చుకునే అవకాశం కల్పించాలని కోరారు.వైసీపీ అరాచక పాలన అంతమై మరికొద్ది రోజుల్లోనే ప్రజా ప్రభుత్వం రాబోతుందని తెలిపారు. గ్రామంలో ప్రజలు ధర్మరాజు గారికి ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు, జనసేన, టీడీపీ, బీజేపీల ముఖ్య నాయకులు, శ్రేణులు, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 66 మంది గైర్హాజరు

విశాలాంధ్ర - కలిదిండి: 10 వ తరగతి పరీక్షలకు 66 మంది హాజరు కాలేదని ఎంఈఓ పి. ప్రభాకర్ రావు సోమవారం తెలిపారు. మండలంలో ఆరు తెగలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ లో 22 మంది, కలిదిండి జిల్లా పరిషత్ హైస్కూల్ లో 4, కోరుకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో 13 మంది, భాస్కరరావుపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో 4, కలిదిండి శశి హై స్కూల్ లో 13 మంది, కోరుకొల్లు క్రాంతి స్కూల్ లో 10 మంది మొదటి రోజున తెలుగు పరీక్షకు హాజరు కాలేదు అన్నారు. మొత్తం 953 మందికి 887 మంది పరీక్షకు హాజరైనట్లు ఆయన తెలిపారు.

భీమవరం టౌన్‌లో : యస్.యస్.సి. పబ్లిక్ పరీక్ష మొదటి రోజైన సోమవారం 93 శాతం మంది విద్యార్థులకు పరీక్ష రాసారని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు తెలుగు పరీక్షకు 23120 మంది విద్యార్థులకు 21 523 విద్యార్థులు హాజరయ్యారన్నారు.1597 మంది గైర్హాజరయ్యారు. దీంతో 93.9శాతం మందిపరీక్ష రాశారన్నారు. పరీక్ష మొదలైన ఈరోజు ఫ్లయింగ్ స్క్వాడ్ 47 స్కూళ్లను,విద్యాశాఖ అధికారి 8 పరీక్ష కేంద్రాలను, సహాయ కమిషనర్ నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు. ఈ పరీక్షా కేంద్రాలలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని విద్యాశాఖ అధికారి రమణ తెలిపారు.

భీమడోలులో: మండల వ్యాప్తంగా పదవతరగతి పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని 6 పరీక్షా కేంద్రాల్లో 1530 మంది ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో చదివే విద్యార్థులు పరీక్షలకు

హాజరుకానున్నారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. విద్యార్థులు ఉదయం 8.30 లోపుగా పరీక్షా కేంద్రాలకు చేరుకుని తమకు కేటాయించిన గదులకు చేరుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేసారు.

పాలకోడేరులో: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుండి మొదలైన పదవ తరగతి పరీక్షలకు పాలకోడేరు మండలంలో మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు 702 మంది విద్యార్థులు హాజరు అవ్వాల్సి ఉండగా 647 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారని 55 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి 1 పెనుమత్స వెంకట శివ నాగరాజు తెలిపారు. పాఠశాలల వారీగా గొల్లలకోడేరు హైస్కూల్ నుండి 137 మంది విద్యార్థులకు 127 మంది, పాలకోడేరు హైస్కూల్ నుండి 176 మంది విద్యార్థులకు 155 మంది, శృంగవృక్షం హైస్కూల్ నుండి 170 మంది విద్యార్థులకు 160 మంది, విస్సాకోడేరు హైస్కూల్ నుండి 79 విద్యార్థులకు 74 మంది, మొగల్లు హైస్కూల్ నుండి 140 మంది విద్యార్థులకు 128 మంది విద్యార్థులు హాజరైనట్టు మండల విద్యాశాఖ అధికారి తెలియజేశారు.

ముసునూరులో: మండలంలోని 16 గ్రామాల విద్యార్థులు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరిక్ష సమయానికి పరీక్ష కేంద్రానికి హాజరైనట్లు ఎంఇఓ బి.వి.సుబ్బారావు అన్నారు.సోమవారం నిర్వహించిన తెలుగు పరిక్షకు ముసునూరు హైస్కూల్ పరిక్ష కేంద్రంలో ముసునూరు,ముసునూరు గురుకుల పాఠశాల,భారతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులతో కలిపి 210 మందికి గాను 9మంది

గైర్హాజరుకాగా, 201 మంది హాజరయ్యారు.చక్కపల్లి పరిక్ష కేంద్రంలో చక్కపల్లి హైస్కూల్ విద్యార్థులు,గుడిపాడు హైస్కూల్ విద్యార్థులు,రమణక్కపేట హై స్కూల్ విద్యార్థులు,చాట్రాయి మండలం మర్లపాలెం హైస్కూల్ విద్యార్థులు, చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థుల తో కలిపి 242 మందికి గాను 10మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 232మంది పరిక్ష రాశారు.గోపవరం హైస్కూల్ పరిక్ష కేంద్రంలో గోపవరం హైస్కూల్ విద్యార్థులు,వేల్పుచర్ల హైస్కూల్ విద్యార్థులు,కాట్రేనిపాడు హైస్కూల్ విద్యార్థులతో కలిపి 167 మందికిగాను ,28 మంది గైర్హాజరైనట్లు డివిజన్‌ల్ విద్యా శాఖాధికారి సేవ్యా తెలిపారు.

మండవల్లిలో : మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండవల్లి జడ్పీ హైస్కూలు కేంద్రంలో 336 మంది విద్యార్థులు, ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన మండవల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రంలో 100 మంది విద్యార్థులు, చింతపాడు హైస్కూలులో 201 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.



తొలిరోజు మండవల్లి హైస్కూలులో 10 గదుల్లో 120 మంది బాలురు, 97 మంది బాలికలు పరీక్ష రాయనున్నట్లు మండవల్లి హైస్కూలు పరీక్షా కేంద్రం చీఫ్ ఎగ్జామినర్ కె ఎస్ హెచ్ ఆంజనేయులు తెలిపారు. కేంద్రం వద్ద ఎటువంటి అసాంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా 144 సెక్షన్ విధించినట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

వడాలి గ్రామస్తులు వైసీపీలో చేరిక

విశాలాంధ్ర-ముదినేపల్లి : మండలంలోని వడాలి గ్రామానికి చెందిన 150 మంది గ్రామస్తులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తనయుడు దూలం వీర ఆది వినయ్ సమక్షంలో కటికల మునియ్య, పాండురంగరావు ఆధ్వర్యంలో వైసీపీ సంక్షేమ పాలన, గ్రామభివృద్ధికి ఆకర్షితులై వైసీపీలో చేరుతున్నట్లు అది వినయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, నాయకులు ఈడే

వెంకటేశ్వరరావు, ఎఎమ్‌సి వైస్ చైర్మన్ బత్తిన కిషోర్, మరీదు హనుమంతు, కోమటి విష్ణువర్ధన్, మద్రివాడ వీరరెడ్డి సుధాకర్ రెడ్డి, షేక్ అల్లాబక్షు, రాచూరి కుమార్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలవరం ఉమ్మడి అభ్యర్థి రేసులో మొడియం సూర్యచంద్రరావు

విశాలాంధ్ర -జీలుగుమిల్లి: శ్రీజగదాంబ అమ్మవారు ఎంతో ఇష్టమైన దైవమని పోలవరం ఉమ్మడి అభ్యర్థి రేసులో ఉన్న మొడియం సూర్యచంద్రరావు అన్నారు. సోమవారం జీలుగుమిల్లిలో శ్రీజగదాంబ

అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు ఆయనకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ అధిష్టానం మేరకు ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. పోలవరం టిక్కెట్టు తనకు కేటాయిస్తే జనసేన, బిజెపి, టిడిపి, తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కక్కిరాల రాము, మాజీ ఎంపీటీసీ చిరి వెంకటేశ్వరరావు, నాయకులు కక్కిరాల చక్రి, చిట్టి బొమ్మ శ్రీనివాసరావు, మైలవరపు లక్ష్మణరావు, ఉలవల వెంకటరమణ, తదితరులు, పాల్గొన్నారు.

శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3,55,089

విశాలాంధ్ర-నరసాపురం : శ్రీదుర్గా లక్ష్మణేశ్వర స్వామి దేవస్థానానికి మహాశివరాత్రి సందర్భంగా హుండీ ఆదాయం రూ. 3 లక్షల55 వేల 089లు వచ్చాయని భీమవరం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వర్దినీడి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం మండలంలోని లక్ష్మణేశ్వరం లోని శ్రీదుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో కొణితివాడ గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు.ఈకార్యక్రమంలో ఆలయ ఈవో చాగంటి సురేష్ నాయుడు, చైర్మన్ కంకటాల పెద్దిరాజు, సిబ్బంది ఎమ్. రమేష్, టి.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం: 10వ తరగతి పరీక్షలు జంగారెడ్డి గూడెం మండలంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తెలుగు,సంస్కృతం పరీక్షలు జరిగాయి. మండలంలో

2వేల 640 మంది విద్యార్థులు సోమవారం పరీక్షకు హాజరు కావలసి ఉండగా 1942 మంది మాత్రమే హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి 1 బి.రాముడు తెలిపారు. 70 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. మండలంలో 9 రెగ్యులర్ విద్యార్థుల పరీక్ష కేంద్రాలు, మూడు ఓపెన్ టెన్త్ విద్యార్థుల పరీక్షా కేంద్రాలు మొత్తం 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. పట్టణంలోని విద్యా వికాస్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించినట్లు చెప్పారు.

ముదినేపల్లిలో: పదో తరగతి పరీక్షలు ముదినేపల్లి మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ముదినేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల,

పెదగొన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాల, సహాయమాత పాఠశాల , ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాట్లు చేసారు. మొత్తం 678 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయాల్సి ఉండగా తొలిరోజు 624 మంది హాజరుకాగా 54 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తుతో ఎస్ఐ డి. వెంకటకుమార్, పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించారు.

వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా చూడండి

విశాలాంధ్ర-మండవల్లి: వాలంటీర్లను ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా చూడాలని బిజెపి నాయకుడు సీఎల్ వెంకట్రావు మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండవల్లి మండలంలోని పలు గ్రామాలను పర్యటించి అక్కడక్కడ పార్టీలు జెండాలు అధికార పార్టీకి

చెందిన బోర్డులు ఇంకా అలాగే దర్శనమిస్తున్నాయని ఎంపీడీవోకి దృష్టికి తీసుకువెళ్లారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం వాలంటీర్లు ఎన్నికల విధుల్లో , ప్రచారాల్లో పాల్గొనరాదని అలా పాల్గొనే వాళ్ళపై కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేసేలా చూడాలని కోరారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ జండాలు అధికార పార్టీ సింబల్స్ ఎక్కడా లేకుండా చర్యలు తీసుకుంటామని వాలంటీర్లు ఎన్నికల విధులు, ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని ఇప్పటికే హెచ్చరించా మని వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేం దుకు ఆయా పార్టీల నాయకులకు కూడా అధికారులకు సహకరించా లని ఎంపీడీవో కోరారు.

గొడ్డలితో గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన పొలిమేర నాగరాజు అదే గ్రామానికి చెందిన అబ్బ దాసరి కాంతారావును పాత గొడవలను పురస్కరించుకొని గొడ్డలితో దాడి చేయగా తలమీద రక్త గాయమైంది. కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారంతో టి నరసాపురం ఎస్ఐ డి. దుర్గా మహేశ్వర రావు కేసు నమోదుచేయడంతో పాటు ముద్దాయిని అరెస్టు చేసి చింతలపూడి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వం

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటమే మానవత్వమని, అదే దైవత్వం అని హీల్ సంస్థ కార్యదర్శి తాతినేని లక్ష్మీ అన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త ఆడుసుమిల్లి ప్రతాప్, తన దిగవంత సతీమణి కీర్తి శేషురాలు ఆడుసుమిల్లి కృష్ణ కుమారి జ్ఞాపకార్ధం అందచేసిన విరాళాముతో తోటపల్లిలో గల ఎలిజబెత్ పాంటన్ లెగసీ ఆఫ్ హోప్ -హీల్ కృత్రిమ అవయవకేంద్రం లో నిడదవోలు కు చెందిన బాలిక బట్టు శృతి కి కృత్రిమ కాలు అందచేసిన సందర్భముగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హీల్ ఫెసిలిటీస్ డైరెక్టర్

టి. భాస్కర్, సి ఈఓ కూరపాటి అజయ్ కుమార్, సీనియర్ టెక్నీషియన్ కె. చిన్నా తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డి కుటుంబసభ్యులకు పరామర్శ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : మండలంలోని గుర్వాయిగూడెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బూసా బాల భాస్కర రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను వైసీపీ నాయకులు జెట్టి గురునాథరావు సోమవారం పరామర్శించారు.కొద్ది రోజుల క్రితం గురవాయిగూడెం లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వి.ఆర్.ఏ. కొదమ

సుబ్బారావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఇరు కుటుంబ సభ్యులకు పార్టీ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి,సర్పంచ్ సత్య,ఎంపీటీసీ కొయ్య రమాదేవి, నాయకులు ముప్పిడి శ్రీనివాసరావు, కొయ్య లీలాధర్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్దే సీఎం ధ్యేయం

విశాలాంధ్ర-పాలకోడేరు: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ ఎంతో కృషి చేస్తున్నారని వారు అభివృద్ధి మరింత చెందాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్ఆర్‌సిపికి మనమంతా అండగా ఉండి మళ్లీ జగన్ ప్రభుత్వాన్ని అధికారంలోనికి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని

ఉండి నియోజకవర్గ వైసీపి అభ్యర్థి పీవీఎల్ నరసింహారాజు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొండేపూడి, వేంద్ర, వేంద్ర అగ్రహారం గ్రామాలలో ఆయన ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసాపురం పార్లమెంటరీ అభ్యర్థి గూడూరి ఉమా బాలకి ఒక ఓటు ఉండి అసెంబ్లీ నియోజకవర్గం ఉండి నాకు ఒక ఓటు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ విజయం చేకూర్చాలని ఆయన కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆయనతోపాటు మండల అధ్యక్షులు భూపతి రాజు చంటి రాజు, బీసీ కులాల జెసి ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతపల్లి గురు ప్రసాద్, మండల వైసిపి అధ్యక్షురాలు కటిక శ్రీదేవి, మండల జె సి ఎస్ ఇంచార్జ్ పాల రాధాకృష్ణ, శృంగ వృక్షం సర్పంచ్ జంగం సూరిబాబు, విస్సా కోడేరు సర్పంచ్ గొల్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ దుండి అశోక్ బాబు, గోరగనమూడి మాజీ సర్పంచ్ చెల్లుబోయిన పాపారావు, మొగల్లు ఉప సర్పంచ్ పెనుమత్స సీతారామరాజు,మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమిదే అధికారం

విశాలాంధ్ర -భీమవరం: చిలకలూరి పేటలో జరిగిన ప్రజాగర్జన సభ విజయవంతమైందని జగన్ రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలు నిర్ణయించుకున్నారని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు తెలిపారన్నారు. జగన్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనం అయ్యిందనివైసిపి, కాంగ్రెస్ పార్టీలు వేరు కాదని ఈ రెండు పార్టీలు ఒకే కుటుంబానికి చెందినవని ఆమె చురకలంటించారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో తెదేపా జనసేన భాజపా కూటమి అధికారంలోకి రాబోతున్నాయని ఆమె పేర్కొన్నారు.

యుద్ధప్రాతిపదికన ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ

విశాలాంధ్ర -భీమవరం: కొత్త ఓటరు గుర్తింపు కార్డులు ఓటర్లకు నేరుగా పంపిణీ చేయడానికి జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయ సిబ్బంది కసరత్తు ప్రారంభించారు.

నూతనంగా ఓటు నమోదు చేసుకున్న వారికి నేరుగా వారు పేర్కొన్న చిరునామాకు పోస్టల్ ద్వారా బట్వాడా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా లక్షా ఏడు వేల మందికి ఓటు గుర్తింపు కార్డులు వచ్చాయని జిల్లా అధికారి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. కొద్ది రోజుల్లో అందరికీ కార్డులు నేరుగా అందుతాయని వారు తెలిపారు.

ఘనంగా ఆరుద్ర నక్షత్రం పూజలు

విశాలాంధ్ర-వీరవాసరం: మండలంలోని రాయకుదురులో వేంచేసి ఉన్న శ్రీ ఉమా మూలేశ్వర స్వామి వారి దేవస్థానము శివాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బ్రహ్మశ్రీ నుదురుపాటి కోదండ రామమూర్తి శ్రీమతి సీతామహాలక్ష్మి వేద పరిరక్షణ సమితి రాయకుదురు, హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రాయకుదురుతోపాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన 15 మంది వేద పండితులచే తెల్లవారు జాము నుంచి ఆలయంలో వినాయకునికి గరిక పూజ ములేశ్వర స్వామి వారికి ఏకాదశ మహన్యాస పూర్వక రుద్రాభిషేకము వివిధ రకాల పందరసా లచే ఘనంగా అభిషేకాలు, అనంతరం "లక్ష బిల్వార్చన", పార్వతీదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామి, అమ్మవార్ల కు నూతన వస్త్రాలు అలంకరణ చేసి, 12 రకాల హారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద

సంఖ్యలో స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాయల నాని బాబు ఈవో కొండవీటి రామచంద్ర రావు బ్రహ్మశ్రీ నుదురుపాటి బాలగంగాధర శాస్త్రి, బ్రహ్మశ్రీ నుదురుపాటి భానుమూర్తి, బ్రహ్మశ్రీ నియోగి సూర్య శేఖర్, బ్రహ్మశ్రీ సతీష్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో రాష్ట్రం నాశనం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జగన్ నమ్మక ద్రోహానికి రాష్ట్ర ప్రజలు బదులు తీర్చుకునేందుకు ఎదురు చూస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ అన్నారు. చిలకలూరిపేటలో నిర్వహించిన టిడిపి జనసేన బిజెపి కూటమి ప్రజాగళం సభ విజయవంతమైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత ఎన్నికల్లో అమలు సాధ్యం కానీ అబద్దపు హామీలతో గద్దెనెక్కిన జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాల సర్వ నాశనం చేసిందని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం దాదాపు పూర్తి చేసిన పోలవరం మిగిలిన పనులను కూడా పూర్తి చేయలేక జగన్ చేతులెత్తేసారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా యువత ఉసురుతీసారని విమర్శించారు. దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్న వైసిపి, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చి లబ్ది పొందాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీలు రెండు ఒకటే అని అన్నారు. అధికార మదంతో దళిత గిరిజన వెనుకబడిన వర్గాల ప్రజలపై అక్రమ కేసులు బనాయించి, దాడులకు తెగబడిన వైసిపి గుండాలకు తమ ఓటుతో ప్రజలు బుద్ధిచెపుతారన్నారు. కూటమి జనగళం సభకు హాజరైన లక్షలాదిమంది జన ప్రభంజనమే వైసిపి పతనానికి నాంది అని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, విజినరీ నాయకుడు చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కలియక దేశంలోని ఒక సరికొత్త చరిత్ర అన్నారు. జగన్ చేతకానితనంతో అన్ని విధాల నాశనమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఎన్నికల తర్వాత ఏర్పడే ఉమ్మడి ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపిస్తుందని తెలిపారు.

వైసీపీని వీడిన నరేష్‌కుమార్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ తీరుతో విసిగి ఇక ఇమడలేక పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వైసీపీ రాజమండ్రి సిటీ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు,బీసీ నాయకుడు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ చెప్పారు.ఆత్మాభిమానం దెబ్బతినడంతో ఇక బయటకు వెళ్ళి పోతున్నానని చెప్పారు.జె.ఎన్.రోడ్డులోని హిందూస్తాన్ జాబితాలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భరత్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.జగన్ మోహన్‌రెడ్డిపై అభిమానంతో 15 సంవత్సరాలుగా పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించానని, కాని భరత్ ఎంపీ అయిన తర్వాత రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో పార్టీ చాలా ఇబ్బంది పడుతోందన్నారు.దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన రావు వర్గం ఇక్కడ బలంగా ఉందని,కాని ఆ వర్గం ఎదగకూడదని భరత్ వారందరిని పక్కన పెట్టి నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చిన వారికి కీలక పదవులు, నామినేటెడ్ పోస్టులు కట్టబెడుతున్నారని మండిపడ్డారు.శ్రీఘాకొళపు శివరామ సుబ్రహ్మణ్యం లాంటి బలమైన నాయకుడిని భరత్ పక్కన పెట్టారని, జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను రాజమండ్రి సిటీలో వేలు పెట్టొద్దని కట్టడి చేయడంతో సిటీలో పార్టీ బలహీనపడిందని నరేష్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు.తాను రాజమండ్రిలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నానని తెలిపారు. మొదటి కోఆర్డినేటర్ బొమ్మన రాజకుమార్ నుంచి డాక్టర్ ఆకుల సత్యనారాయణ వరకు కలిసి పనిచేశానని చెప్పారు.రాజమండ్రిలో బ్లేడ్ బ్యాచ్ లు, గంజాయి బ్యాచ్‌లు ఉన్నాయని ఇతరుల మీద ఆరోపణలు చేసే భరత్ తనను తప్పించి యువజన విభాగం అధ్యక్షుడిగా ఒక రౌడీ షీటర్‌ను నియమించడం హాస్యాస్పదమని విమర్శించారు.జక్కంపూడి వర్గం అనిచెప్పి కీలక పదవులు లేవు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వడంలేదని,కార్యకర్తల బాగోగులు చూడడంలేదని మండిపడ్డారు. బీసీలకు సమ న్యాయం లేదని, శెట్టిబలిజలను తప్ప మిగతా బీసీలకు అన్యాయం చేస్తున్నారని,రూరల్ మాజీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, తనకు, మరికొందరికి జరిగిన అన్యాయం గురించి గుర్తు చేశారు.భరత్ నియంతృత్వ ధోరణికి విసిగి ఇన్నమూరి దీపు లాంటి వారుకూడా బయటకు వెళ్ళి పోయారని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక పార్టీలో ఇమడలేక రాజీనామా చేస్తున్నట్లు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ చెప్పారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బొగ్గవరపు

విశాలాంధ్ర-వత్సవాయి : స్థానిక వాసవి కళ్యాణమండపం ప్రాంగణంలో ఎన్టీఆర్ జిల్లా తొలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా బొగ్గవరపు వెంకటరాజారావు మరియు జిల్లా మహిళా విభాగం, యువజన సంఘం విభాగం, మరియు కార్యవర్గ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఇంతటి నమ్మకంతో సేవలను గుర్తించి జిల్లాలోనే మొట్టమొదటి ఇంతటి ఘనమైన బాధ్యతతో కూడి ఉన్న పదవిని ఇవ్వడం ఆనందదాయకంగా ఉందని సమగ్ర స్థాయిలో కృషిచేసి అందరినీ ముందుకు నడిపే విధంగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు రామ చిన్ని రామ సత్యనారాయణ , మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య,అంబికా కృష్ణ , క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు ,మాజీ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు , పెనుగొండ సుబ్బారాయుడు ,మహిళా విభాగం అధ్యక్షురాలు కొప్పురావూరి రజినీ తదితరులు పాల్గొన్నారు.

అడాపా బాజ్జీ 3వ వర్థంతి

విశాలాంధ్ర - గుడివాడ : అందరితోను కలిసి ఉండే మహోనత వ్యక్తి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అడపా వెంకటరమణ(బాజ్జీ) అని వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా నాయకులు మండలి హనుమంతరావులు అన్నారు. సోమవారం స్థానిక శరత్‌దియోటర్‌లోని వైసిపి కార్యాలయంలో అడపా బాజ్జీ 3వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్రపటాకి పూలమాలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంలో అందరితో కలసి మెలసి ఉండే నాయకుడు అడపా అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, నాయకులు సైమన్, చింతల భాస్కర్, చూందూరి శేఖర్, కొంకితల అంజనేయప్రసాద్, అల్లం రామెహ్మన రావు, రేమల్లి నీలాకాంత్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చడమే లక్ష్యంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డి లీలా కృష్ణ అన్నారు. చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోషల్ సర్వీసు కార్యాలయం వద్ద ఒక చలివేంద్రం, పులిగడ్డ సర్కిల్‌లో మరొక చలివేంద్రం మొత్తం 2 చలివేంద్రాలు 2వ సంవత్సరం నడుపుతున్నట్లు, ఈ సంవత్సరం చలివేంద్రాలను ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీ అలపర్తి గోపాలకృష్ణ, మోపిదేవి శ్రీనివాసరావు, కమ్మిలి ప్రసాద్, ఠాగూర్, డాక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే ముస్లింలు గుర్తొస్తారు

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాజకీయ పక్షాలకు ఎన్నికల్లో మాత్రమే ముస్లింలు గుర్తుకు వస్తున్నారని ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక తమ సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ముస్లిం చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు నాగూర్ షేక్ ఆరోపించారు. సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12% ఉన్న ముస్లిం జనాభాకి ఒక్క పార్లమెంటు స్థానం కూడా కేటాయించకపోవడం దారుణం అన్నారు.25 పార్లమెంటు స్థానాలు ఉన్నాయని అందులో ముస్లింలకు రెండు స్థానాలు అయిన కేటాయించాలని డిమాండ్ చేశారు. వక్ బోర్డ్ ఆస్తులకి ప్రత్యేక చట్టం తీసుకువస్తామని ప్రతి ఎన్నికలలో పార్టీలు చెప్పటం అనంతరం దానిని విస్మరించడం జరుగుతుందన్నారు.ఏ పార్టీ కూడా నామినేటెడ్ పదవులు ఇవ్వలేదన్నారు.మాకు రాజకీయ అవకాశాలు జనాభా నిష్పత్తి ప్రకారం కల్పించాలన్నారు. ముస్లిం పెద్దలతో చర్చించి ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలో తెలియజేస్తామని అన్నారు.తాము అందరూ ఐక్యమత్యం గా ఉండి ఏ పార్టీకి మద్దతు లేకుండా అన్ని సంఘాల్ని కలుపుకొని రానున్న రోజుల్లో ఓటు అనేది ఓటు విలువ ఎలా ఉంటుందో తెలియపరచడానికి ప్రతి గడపకి వెళ్లి మన సమస్యలు పరిష్కరించి వాళ్లకే మనం ఓట్లు వేద్దాం అని చేప్పే ప్రయత్నం చేస్తున్నామన్నారు.ఈ సమావేశంలో మహబూబ్ సుభాని,ఫరీద్ షేక్,ఝకిరియా,తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాజమండ్రి పేపర్ మిల్ మెయిన్ గేటు ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణ సాయి కళ్యాణ మండపంలో రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి అధ్యక్షతన రాజమహేంద్రి ప్రైవేటు కాలేజెస్ అండ్ స్కూల్స్ అసోసియేషన్ తరపున ఏర్పాటు చేసిన సమావేశంలో రాజమహేంద్రవరం లోని ప్రైవేట్ స్కూల్స్, జూనియర్ కళాశాలల, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్ పాల్గొని అవి ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ స్కూల్ ల, జూనియర్ కళాశాలల, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కలిసి కట్టుగా సంఘటితమై ఒక యూనియన్‌గా ఏర్పడాలని నిర్ణయించారు. విద్యాసంస్థల పరిమిషన్‌కి గవర్నమెంట్ ఇచ్చే సర్టిఫికెట్స్ ఐదు సంవత్సరాల వ్యాలిడిటీతో ఉండాలని పీజీ చదువుకునే విద్యార్థులకు లోగడ ఫీజు రెంబర్స్ మెంట్ ఇచ్చే వారిని ఆ విధానాన్ని మరలా అమలు చేయాలని ర్యాలీలకు పిల్లలను పిలవకూడదని స్కూల్ బస్సులకి ట్రాన్స్‌పోర్ట్ టాక్స్ భారీగా పెంచారని వాటిని తగ్గించాలని మార్కుల సిస్టమును తీసివేసి గ్రేడ్ సిస్టంను ప్రవేశపెట్టాలని దీనివలన పిల్లలు మరియు తల్లిదండ్రులు, టీచర్లు ఒత్తిడికి గురికాకుండా ఉంటారని సభ్యులు అన్నారు. రాజమహేంద్రవరం.నగరంలోని ప్రతి ఒక్క ప్రైవేటు స్కూలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల యాజమాన్యాలు యూనియన్ లో జాయిన్ అయ్యి సభ్యులుగా చేరాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రగతి విద్యాసంస్థల సుంకర మురళి, మెగా విద్యాసంస్థల గంగాధర చౌదరి, తేజస్ పబ్లిక్ స్కూల్ కళ్యాణ్ రెడ్డి, ప్రసాద్ పబ్లిక్ స్కూల్ ప్రసాద్, శోభ స్కూల్ సురేష్, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం గోవిందరాజులు, సత్యనారాయణ రెడ్డి, జాస్తి బుల్లమ్మ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాల, భారతరత్న ఎస్ఆర్ స్కూల్, నారాయణ జూనియర్ కళాశాల ఏజీఎంలు, ప్రిన్సిపాల్ లు వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

మండలంలో 150 మంది గైరుహాజరు

విశాలాంధ్ర - గోపాలపురం : పదో తరగతి పరీక్షలలోని మొదటి రోజు 150 మంది విద్యార్థులు గైరు హాజరైనట్లు ఎంఈఓ జి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలకు మండల పరిధిలోని 1021 మంది హాజరు కావలసి ఉండగా నేడు జరిగిన తెలుగు పరీక్షలో 866 మంది పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఎంఈఓ తెలిపిన వివరాల ప్రకారం జడ్పీ హై స్కూల్ రాజంపాలెం నుండి 199 మందికి గాను 173 మంది హాజరు కాగా 26 మంది గైరవ హాజరు, సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ దొండపూడి నుండి 180 మంది హాజరు కావలసి ఉండగా 154 మంది హాజరై 26 మంది గైరహాజరైనట్లు, జడ్పీహెచ్ గోపాలపురం నుండి 228 మందికి గాను 187 మంది హాజరై 41 మంది గైరహాజరైనట్లు, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుండి 200 మందికి గాను 184 మంది హాజరై 16 మంది హాజరైనట్లు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ గోపాలపురం నుండి 214 మంది గాను 186 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరైనట్లు ఆయన వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతి సౌకర్యాలను మంచినీరు, వైద్యం మరియు తగిన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

వెనిగండ్ల రాముకు అశేష ప్రజాదరణ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని కూరాడ గ్రామంలో సోమవారం టిడిపి, జనసేన, బిజెపి కూటమి పార్టీల అభ్యర్థి వెనిగండ్ల రాము, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, ఇంటింటికి టిడిపి కార్యక్రమాలు నిర్వహించారు. కూరాడ లాకుల వద్ద కూటమి పార్టీల నాయకులు, ప్రజలు రాముకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాము ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ, సూపర్ సిక్స్ మేనిఫెస్టో అంశాలను ప్రజానీకానికి వివరించారు. రాముకు వీధి వీధినా మహిళలు మంగళహారతులతో రాముకు స్వాగతం పలికారు. వివిధ వర్గాల ప్రజానీకంతో మమేకమవుతూ, ఆత్మీయ పలకరింపుల మధ్య విజయవంతంగా సాగిన రాము పర్యటనలో పూర్తిగా పూడికపోయి, దుర్భర స్థితిలో ఉన్న కూరాడ పంట కాలువ పరిస్థితిపై, దళితవాడలలోని రోడ్ల దుస్థితిపై రాము సెల్ఫీ చాలెంజ్ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడ్లవల్లేరు టిడిపి అధ్యక్షుడు కోసరాజు బాపయ్య చౌదరి, పార్టీ నాయకులు కొడాలి రామరాజు, వల్లభనేని బాబురావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట చిన్నారి, కూరాడ టీడీపీ నాయకులు వాసా శ్రీరామచంద్రమూర్తి, కళ్యాణపు నవాబు,సీరం నాగ రమేష్, పులి ప్రసాద్, మద్దాలి నాని, సీరం సుబ్బారావు, దాసరి కృష్ణారావు, సాయన బాబురావు, రావాడ గోపాల్, ఆకుల శివయ్య మండల టీడీపీ నాయకులు సాయన పుష్పావతి, అడుసుమిల్లి చిట్టిబాబు, వి. శివప్రసాద్, బొప్పన శివప్రసాద్, పొట్లూరి రవి, చాపరాల బాలాజీ, చాపరాల రాజా, సురగాని ప్రసాద్, కాగిత నరేంద్ర, గోవాడ శివ, చింతలగుంట మోహన్, పామర్తి కన్య భాస్కరరావు, ఆకుల శివయ్య, దేవిశెట్టి రామకృష్ణ, ఎస్ ప్రసాద్, జంగం మోహన్, సమ్మెట సాంబయ్య, తూము పద్మజ, తెల్లాకుల నాగలక్ష్మి, దివ్య చౌదరి, మన్యం పద్మావతి, నిమ్మగడ్డ శశికళ, దారా సత్యనారాయణ, అందువల్ల ఏసుపాదం, మరీదు రోహిణి కుమార్, సొంటి కోటయ్య, మద్దికూరి ప్రభాకర్, మన్యం నరసింహారావు, నిమ్మగడ్డ సత్యసాయి, గుడివాడ జోన్స్, మాదాస్ ప్రసాద్, గూడూరు సురేంద్ర, గద్దం ప్రకాష్ దాస్, సురగాని సూరిబాబు,గుడివాడ నియోజకవర్గ టిడిపి జనసేన ముఖ్య నాయకులు, తెలుగు మహిళ, తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, ఐ.టీడీపీ,టీడీపీ జనసేన అనుబంధ విభాగాల నేతలు,పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్పతరు ప్రాజెక్ట్‌లో ఐదుగురికి ఉద్యోగాలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: భారత దేశంలోనే అతిపెద్ద నిర్మాణ సంస్థ అయిన కల్పతరు ప్రాజెక్ట్స్ వారు ఈ నెల ఒకటవ తేదిన గవర్నమెంట్ మరియు ప్రైవేట్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రాంగణ నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా తుది ఫలితాలను శుక్రవారం ప్రకటించారు. వారిలో రాష్ట్ర వ్యాప్తంగా గవర్నమెంట్, ప్రైవేట్ పాలిటెక్నిక్ ల నుండి 15 మంది విద్యార్థులను ఎంపిక చేయగా వారిలో అత్యధికంగా గుడ్లవల్లేరు ఏ.ఏ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్.పాలిటెక్నిక్ నుండి 5 గురు సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రూ.2.75 లక్షల వార్షిక వేతనంతో కొలువులు సాధించారని, కొలువులు సాధించిన వారికీ కల్పతరు సంస్థవారే పూర్తి ఉచిత వసతి,భోజన సదుపాయాలు కల్పిస్తారని ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ తెలియజేసారు. విద్యార్థులు అతిచిన్న వయస్సులోనే కొలువులు సాధించడం అనేది ఒక్క డిప్లొమా విద్యతోనే సాధ్యపడుతుందని ప్రిన్సిపాల్ ఈ సందర్భగా పేర్కొన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎమ్. వినయ్ ని, కొలువులు సాధించిన విద్యార్థులను, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి బి.ఎమ్.ఎస్.కిరణ్ లను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సత్యనారాయణ రావు వల్లూరుపల్లి, కో-సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వల్లూరిపల్లి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి. రామాంజనేయులు, ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ వారిని అభినందించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక అక్షర విద్యార్థులు రోడ్డు ప్రమాదాలపై సోమవారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించాలి, రోడ్డు ప్రమాదాల భారీ నుండి రక్షించుకోవాలి అంటూ అక్షర విద్యాలయ అధ్వర్యంలో విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. తొలుతగా ఆ పాఠశాల విద్యార్థులు ర్యాలీగా ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్‌కు చేరుకుని అక్కడ మానవహారం నిర్వహించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని రాధేయ పాలెం గ్రామం, దివాన్ చెరువు గ్రామానికి చెందిన డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుంకర ఫౌండేషన్ అధినేత వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పిల్లల పెంపకంపై తల్లుల కీలక పాత్ర పోషించాలని చెప్పారు. పిల్లల్ని చిన్నప్పటి నుండి గమనిస్తూ ఉండాలన్నారు. వ్యక్తిగత సంపాదన ఉంటే అది కూడా న్యాయబద్దంగా సంపాదిస్తే గర్వంగా ఉంటుందన్నారు. మహిళలకు తమ సంస్థ అందిస్తున్న టైలరింగ్ శిక్షణ నీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈవూరి దుర్గ శిక్షణ అందిస్తున్నారని తెలిపారు.దాదాపు 50 మంది మహిళలు శిక్షణ తరగతులకి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు,సుంకర వీరాస్వామి, సభ్యులు కె. మీనా, జె.కుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర - కాకినాడ : ముమ్మిడివరం నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు, అమలాపురం పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్ బాలయోగి లను గెలిపించండి అంటూ కోరంగి పంచాయతీ సీతారామపురంలో క్లస్టర్ ఇంచార్జి టేకుమూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో శ్రీ కాళికాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటి ఇంటికి ప్రచారం నిర్వహించారు, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంటపల్లి చంద్రమౌళి, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు ప్రతీ ఇంటికి వెళ్ళి తెలుగుదేశం, జనసేన, బిజేపి, అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు జేయు సంక్షేమ పథకాలను వివరించారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు, మన పిల్లలు భవిష్యత్తు, రాజధాని లేని రాష్ట్రానికి రాజధాని కావాలంటే విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు కే సాధ్యమని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) అన్నారు. ఈ కార్యక్రమంలో వుంగరాల వెంకటేశ్వరరావు, నడింపల్లి వినోద్, టేకమూడీ సత్యనారాయణ, టేకమూడి అనంతలక్ష్మి, వెంటపల్లి ఉమామహేశ్వరి, జువ్వాది సత్యవేణి, సత్య, వరలక్ష్మీ, పెమ్మాడి కృష్ణవేణి, కోడూరి ఆదినారాయణ, తాతాజీ చంద్రాల బుజ్జి, కృష్ణ, జనసైనికులు చెల్లా గంగారావు, వాసు, లక్ష్మణరావు, సలాది నాగేశ్వర రావు, అడబాల వీరబాబు, రాజు, చంద్రాల శ్రీను, పినపోతు సోమ రాజు, మంచెం సోమరాజు, బూత్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

విశాలాంధ్ర - కొవ్వూరు : నియోజకవర్గ జనసేన నూతన కమిటీని నియమిస్తున్నట్టు ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే టీడీ రామారావు ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం కొవ్వూరులోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ కార్యవర్గ వివరాలను వెల్లడించారు. కొవ్వూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా తొర్లపాటి చంద్రశేఖర్, బీసీ సెల్ అధ్యక్షుడిగా కల్లి శ్రీనివాస్, తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామ మహిళా అధ్యక్షురాలుగా పసలపూడి వెంకటలక్ష్మి తాళ్లపూడిమండల మహిళ ఉపాధ్యక్షురాలుగా సంకా బత్తుల వెంకటలక్ష్మి, పార్టీ మండల చాగల్లు మండల పార్టీ అధ్యక్షునిగా కన్నాజీ రామాంజనేయులు యువజన విభాగం అధ్యక్షునిగా ఏపుగంటి నాగబాబు కొవ్వూరు మండల యువజన అధ్యక్షుడిగా గంగుమళ్ళ స్వామి, తాళ్లపూడి మండల యువజన అధ్యక్షులుగా పూలపల్లి బాలకృష్ణ లను నియమించారు. వీరంతా కొవ్వూరునియోజకవర్గ తెదేపా, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వెంకటేశ్వరరావు గెలుపునకు కృషి చేయాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో జనసేన అధ్యక్షులు దేగలరాము తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృషి

విశాలాంధ్ర-పెదన: పెడన మండలం పెదపుల్లపాడు, చోడవరం పాల ఉత్పత్తిదారుల అసోసియేషన్‌లను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సందర్శించి పాల ఉత్పత్తిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.పాల ఉత్పత్తిదారులకు మేలైన యాజమాన్య పద్ధతులు, మరియు మెరుగైన పశుపోషణ కు సంబంధించి పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని తెలిపారు పాల ఉత్పత్తిదారులకు ప్రతి నాలుగు మాసములకు 10% చొప్పున ధర వ్యత్యాసం(బోనస్) పంపిణీ చేయడం జరుగుతున్నది అని, క్షీర బంధు, కళ్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలతో పాటు పశువులకు ఉచితంగా పశు వైద్య శిబిరాలు జలగ ముందు అందిస్తున్నామని , సబ్సిడీపై 20% ప్రోటీన్ కలిగిన పశుదాణా మరియు పశువులకు మేలుజాతి కృత్రిమ గర్భోత్పత్తి సేవలు రూ.50/- లకే చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ పాలక వర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్ , గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, అసోసియేషన్ ల అధ్యక్షులు లు గూడవల్లి నాగరాజు, వుచా జ్వాల బాబు, సూపర్ వైజర్ పేయ్యేటి బసవ రాజ కుమార్, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : విద్యాశాఖ ఆదేశాలతో సోమవారం నుంచిఒంటి పూటబడులు ప్రారంభమైనాయి. మొవ్వ మండలంలో పదవ తరగతి పరీక్ష కేంద్రాలు కొనసాగుతున్న కూచిపూడి, పెదసన గల్లు, నిడుమోలు, కాజ, కోసూరు, మొవ్వ జిల్లా పరిషత్ హైస్కూళ్ళలో పరీక్షలు అయ్యేవరకు మూడు నుంచి తొమ్మిదవ తరగతి వరకు పిల్లలకు మధ్యాహ్నం వేళలో పాఠశాలలు నిర్వహించారు మిగిలిన ఎలిమెంటరీ, యూపీ, జెడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఉదయం 7:45 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించే ఒంటిపూట బడులకు తొలి రోజు 4856 మందికి 3400 మంది విద్యార్థులుహాజరవగా 1456 మంది గైర్హాజరైనట్లు సమా చారం. ఉదయం 10 నుండి-10:30 గంటల మధ్య పావు గంట సేపు కొనసాగిన విరామంలో విద్యార్థులకు చిక్కి (వేరుశనగ పప్పు చెక్క) ప్యాకెట్లుపంపిణీ చేశారు.

తొలిరోజు పదిపరీక్షలు ప్రశాంతం

విశాలాంధ్ర - రాజానగరం : పదోతరగతి పరీక్షలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. రాజానగరం మండలంలో తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నిర్వాహకులు విద్యార్థులను తనిఖీలు చేసి పరీక్షాకేంద్రం లోకి పంపించారు. మండలంలో ప్రస్తుత విద్యాసంవత్సరానికీ సంబంధించి రెగ్యులర్ కోటలో 1095 విద్యార్థులకి తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో జరిగిన తొలి పరీక్షకి 1087 మంది హాజరు కాగా 8 మంది విద్యార్థులు గైహాజరైనట్లు మండల విద్యాశాఖాధికారులు- 1,2 ఎం.రామన్న దొర,గుబ్బల జ్యోతి ప్రసాద్ చెప్పారు.

విశాలాంధ్ర - పెరవలి : మొదటి రోజు 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారులు బి.బిఎస్‌స్వరూప్ ఎస్. సూర్జాన్ తెలిపారు. మండలంలో మొత్తం 903 మంది విద్యార్థులకు 845 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

విశాలాంధ్ర - సీతానగరం : కట్టుదిట్టంగా పది పరీక్షలు ప్రారంభం అయ్యాయి. మండల వ్యాప్తంగా నాలుగు పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తుతో పాటు 104 సెక్షన్ అమలు చేయగా నో మొబైల్ జోన్‌గా పరిగణలోకి తీసుకున్నారు. మండల మొత్తం మీద 803 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 35మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు అని మండల విద్యాధికారి స్వామి నాయక్ తెలిపారు.

విశాలాంధ్ర-దేవరపల్లి : మండలంలో ఐదు సెంటర్లలో 1013 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 948 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎం తిరుమలదాసు కెఆర్ఎస్‌వివి అప్పారావు తెలిపారు వీరిలో రెగ్యులర్ అభ్యర్థులు 947 మందికి గాను 917 మంది పరీక్షలు రాసినట్లు తెలిపారు గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు 66 మందికి గాను 31 మంది పరీక్షలు రాసినట్లు తెలిపారు మండలంలో దేవరపల్లి అంబటి సత్యనారాయణ రావు జిల్లా పరిషత్ హై స్కూల్ దేవర పల్లి భాష్యం స్కూలు దేవరపల్లి శ్రీ చైతన్య స్కూలు ఎర్నగూడెం జిల్లా పరిషత్ హై స్కూలు చిన్నాయగూడెం జిల్లా పరిషత్తు హైస్కూల్లో పబ్లిక్ పరీక్ష పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓలు తెలిపారు.

విశాలాంధ్ర - గోపాలపురం : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో పబ్లిక్ పాఠశాలకు ఐదు సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. గోపాలపురం జిల్లా పరిషత్ హై స్కూల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల వేల చింతలగూడెంలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ రాజంపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ రాజంపాలెం సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లలో ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు ఈ ఏడాది మండల వ్యాప్తంగా 978 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఒక్కొక్క తరగతి గదిలో 24 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారన్నారు పరీక్షల నిర్వహణ కొరకు 68 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందన్నారు ఈనెల 18వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు.

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మండలంలో 10వ తరగతి పరీక్షలకు 638 మంది హాజరయ్యారు. మలకపల్లి జడ్పీ హెచ్‌స్కూల్లో ఏ, బి కేంద్రాలు, తాళ్ళపూడి, వేగేశ్వరపురం మొత్తం మండలంలో నాలుగు పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు, ప్రవేట్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగించారు. మొత్తం 716 మందికి గాను 638 మాత్రం హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి నెహ్రు తెలిపారు. మొదటి రోజు స్క్వాడ్, డివైఈఓ సూర్య నారాయణ తాళ్ళపూడి జడ్పిహెచ్‌స్కూలులోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు.

విశాలాంధ్ర - కొత్తపేట : కొత్తపేట మండలంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి మండలంలోని కొత్తపేట ప్రభుత్వ బాలుర హైస్కూలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల చప్పిడి వారిపాలెం జడ్పీహెచ్‌స్కూల్, వానపల్లి జడ్పీహెచ్ స్కూల్ సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు.ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే పరీక్షలు సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ ఎం హరి ప్రసాద్ తెలిపారు.

విశాలాంధ్ర - కరప : మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ఉదయం ఆరు కేంద్రాలలో ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులు 1003 మందికి 997 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. పిల్లలకు అవసరమైన అవసరాలు ఏర్పాటు చేశామన్నారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : సాక్షాత్తు ఆ పరమశివులే ఈ కలియుగంలో ఆదిశంకరా చార్యులుగా అవతరించి ఈ భూమి మీద నడయాడారని ఏర్పేడు శ్రీ వ్యాస పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానంద గిరి స్వామి వారు పేర్కొన్నారు దేవరపల్లిలో సోమవారం జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య మందిరంలో ఆయన వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి యుగంలో మహా శివుడు అవతరించి ఈ భూమిపై నడయాడి భక్తులకు దర్శనమిస్తుంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావము కలిగి ఉండి ధర్మాన్ని ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు ఆదిశంకరాచార్యులు బోధనలు అందరికీ స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు భారతదేశంలో నాలుగు సార్లు పర్యటించి తూర్పు పడమర ఉత్తర దక్షిణాదిలో పీఠాలు స్థాపించి ఆ పీఠాల ద్వారా వేదాలు పరిరక్షణ హిందూ ధర్మం గొప్పతనాన్ని వివరించటానికి పీఠాధిపతులను నియమించారని అన్నారు దేవరపల్లిలో జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యుల ఆలయం నిర్మించి భక్తులకు ఆధ్యాత్మికతను కలిగించినందుకు ఆలయ కమిటీని అభినందించారు ఈ సందర్భంగా ఆదిశంకరాచార్యుని రచనలు అద్వైత సిద్ధాంతాన్ని సవివరంగా వివరించారు నిత్యం భగవద్గీత మహాభారతం రామాయణం శివానందలహరి సౌందర్యలహరి భాగవతం పాటించాలని అన్నాడు ఏర్పేడు లో వ్యాస పీఠాన్ని 1926 లో ఏర్పాటు చేయటం జరిగింది అని అన్నారు మలయాళ స్వామి పీఠాధిపతులుగా విశేష సేవలు అందించి హిందూ ధర్మాన్ని వేద పరిరక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు ఈనెల 24వ తేదీ వ్యాసపీఠం 98 వ వార్షికోత్సవ వేడుకలు హైదరాబాదులో నిర్వహిస్తున్న మన అన్నారు వేద విజ్ఞాన సభల పేరున జరుగుతున్న ఈ కార్యక్రమంలో దేశంలో వివిధ పీఠాధిపతులు గురువులు పండితులు హాజరవుతారని 20 27వ తేదీ వరకు సభలు నిర్వహించటం జరుగుతుందని అన్నారు 99 వ వార్షికోత్సవ వేడుకలు బొంబాయిలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు 100వ వార్షికోత్సవ వేడుకలు 2026 మార్చిల నిర్వహిస్తామని పరిపూర్ణానందగిరి స్వామి తెలిపారు తమ ఆశ్రమంలో ఉదయం 4:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ పూజా కార్యక్రమాలు హోమాలు వేద పారాయణ నిత్యం నిర్వహిస్తూ ఉంటారని తెలిపారు తమ ఆశ్రమం 30 ఎకరాలలో వివిధ ఆలయాలు తో పాటు 450 మంది మహిళా విద్యార్థులకు ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు ఉచితంగా విద్యా సౌకర్యం కల్పిస్తున్నామని ఆయన వెల్లడించారు ప్రధాన కార్యదర్శి తోట సత్యనారాయణ ఉపాధ్యక్షులు నారాయణ విశ్వేశ్వరరావు సహాయ కార్యదర్శి చెరవూరి సత్యనారాయణ గౌరవ సలహాదారు విష్ణుపట్ల రామారావు గ్రామ ప్రముఖులు యాగంటి వెంకటేశ్వరరావు బల్ల సూర్యచక్రం నూలు వెంకట్రావు పప్పు వెంకట రామారావు పిచ్చుకల మల్లేశ్వరరావు కొత్తగుండి బాబురావు వెలగా శ్రీనివాస్ బులుసు సత్యనారాయణ సుతాపల్లి చిట్టయ్య సౌందర్యలహరి పారాయణ కమిటీ సభ్యులు వంటి పాల్గొన్నారు.

బాల శివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : బాలశివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించారు. మండల పరిధిలోని దక్షిణచిరువోల్లంక మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం కృష్ణా నదీ నడుమ వెలసిన బాలశివశంకర భగవాన్‌కు శోభాకృత నామ సంవత్సరం ఉత్తరాయనం, శిశిర ఋతువు, పాల్గునమాసం, శుక్లపక్షం, దశమి తిథిని పురస్కరించుకుని సోమవారం ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వామి వారికి నవవిధ అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ముందుగా స్వామి వారిని కృష్ణానదీజలాలతో అభిషేకించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వయంగా పర్యవేక్షించారు.